'ఆంధ్రభూమి' దినపత్రిక - 4.12.1987

# విలువలు

సుబ్బరామయ్యకి నరసమ్మతో వివాహం నిశ్చయమైంది. నరసమ్మ లేతగా, అందంగా, పుత్తడిబొమ్మలా వుంటుంది. అంతకన్నామించి మంచి సాంప్రదాయ కుటుంబంలోంచి వచ్చింది. అంచేత సుబ్బరామయ్య తండ్రికి ఎందుకు నచ్చదూ? ఇక పెళ్ళే తరువాయి. పెళ్ళిళ్ళు శుభముహూర్తాల్లోనే జరుగుతాయి గనుక శుభముహూర్తం లేక పెళ్ళి పది నెలలు వాయిదా పడింది.

పది నెలల గడువు మరో నెలతో ముగియనున్న సమయంలో నరసమ్మ పుష్పవతి అయింది.

హతాశుడయ్యేడు సుబ్బరామయ్య తండ్రి. ఆ రోజు ఇంట్లో ఆ విషయం పెద్ద చర్చనీయాంశమైంది.

తాళి కట్టిన తర్వాతే కోడలు రజస్వల కావాలనుకున్నాడు మామ. నెల రోజులు ముందుగా అయిపోయింది నరసమ్మ.

కొంప మునిగిందిప్పుడు. ఏం చేయడం?

రజస్వల అవ్వక మునుపే నరసమ్మ 'మన పిల్ల' అనుకున్నాం గాబట్టి... ఫర్వాలేదు అన్నాడు పట్నంలోనున్న బంధువు.

ఇంత ఎత్తున ఎగిరేడు సుబ్బరామయ్య తండ్రి.

పరువు, ప్రతిష్ఠ ఉన్నవాడెవడూ, సంప్రదాయాన్ని గౌరవించే వాడెవడూ... ఇలాంటి

పెళ్ళి చేసుకోడు. దేశంలో ఆడపిల్లలకేం కొదవలేదు. మరో బాలికను చూడమన్నాడు సుబ్బరామయ్య తండ్రి.

✿ ✿ ✿

సుబ్బరామయ్య కుమారుడు వెంకట్రావు లక్ష్మిని పెళ్ళి చూపుల్లోచూసేడు. వయస్సు, అందం, చదువు, కట్నం అన్నీ తృప్తి కలిగించేయి.

అంతా బాగున్నప్పటికీ అసలు విషయం తెలిసి మండిపడ్డాడు వెంకట్రావు.

లక్ష్మి ఉద్యోగం చేస్తున్నదని తెలిస్తే - అసలు ఇంత దూరం పెళ్ళిచూపుల వరకూ వచ్చి వుండేవాడిని కాదని విసుక్కున్నాడు వెంకట్రావు.

ఇంటిపట్టున సంసార పక్షంగా వుండే ఇల్లాలు కావాలిగాని, రోడ్డు మీద పడి ఉద్యోగాలు, ఊళ్ళు ఏలే బజారు స్త్రీలు తనకు అక్కర్లేదు అన్నాడు.

అమ్మాయినిచ్చుకున్నవాళ్ళు చేయరాని తప్పు చేసినట్టు తల వంచుకొని ఈ క్షణం నుంచే అమ్మాయిని ఉద్యోగం మానిపించేస్తామన్నారు.

మానిపించేయడం సరే. మరి ఇన్నాళ్ళు నలుగురి మధ్య తిరిగిన సంగతి ఏమిటి? అంచేత -

'నాకీ సంబంధం ఇష్టం లే'దన్నాడు స్పష్టంగా వెంకట్రావు.

✿ ✿ ✿

సంజయ్ - సుబ్బరామయ్య మనవడు, వెంకట్రావు పుత్రుడు - ఎన్ని సంబంధాలు వచ్చినా తిరగ్గొడుతున్నాడు.

కట్నాలు, కానుకలూ ఎలానూ వుంటాయి. కాని ముఖ్యంగా తనకి కాబోయే భార్యకి వుండాల్సిన ఏకైక అర్హత గురించి స్పష్టం చేశాడు ఇంట్లో.

వెంకట్రావుకి ఇష్టంలేకపోయినా 'కలికాలం' అనుకుంటూ, చచ్చినట్టు తన అబ్బాయికి కావల్సిన అర్హతగల అమ్మాయిని చూసేడు. అమ్మాయి పేరు స్వప్న. పేరు బాగుంది. వయసు బాగుంది. అందం బాగుంది. కట్నం బాగుంది.

మరికనేం?

పెళ్ళి అయిపోయిందనుకున్నారంతా.

ఈలోగా... స్వప్న గురించి ఎంక్వయిరీ చేస్తే... ఆమె చేస్తున్నది టెంపరరీ ఉద్యోగమని తేలింది. రెండు, మూడు నెలల్లో ముగిసిపోతుందని తెలిసింది.

మండిపడ్డాడు సంజయ్?

'చక్కని పిల్ల, మంచి సంబంధం ఒదుల్కోకు నాయనా! వెధవ ఉద్యోగం పోతే పోనీయ్' అన్నాడు తండ్రి.

"అదేం కుదర్దు. గ్యారంటీగా సంపాదించే భార్య కావాలి నాకు. మంచి ఉద్యోగం చేసే మరో అమ్మాయిని చూడండి" అని స్పష్టం చేశాడు సంజయ్. ✿